క్లుప్తంగా

రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమై వరి సాగులో రైతులు బిజీగా వున్న తరుణంలో యూరియా కొరత వేధిస్తోందన్నారు. రైతులకు సరిపడా ఎరువులు దొరక్కపోవడంతో రైతన్నలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు.

అనధికారిక నిర్మాణంపై చర్యలు



జేసీబీ సహాయంతో అనధికార నిర్మాణం తొలగింపు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని సీబీ కాలనీ ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణ పునాదులను ప్రణాళిక అధికారులు బుధవారం తొలగించారు. జేసీబీ సహాయంతో పునాదులను తొలగించి చదును చేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణ మూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారి అప్పలరాజు, ఇతర ప్రణాళిక సిబ్బందితో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న దుకాణాల ఏర్పాట్లు అడ్డుకున్నారు. అనంతరం జేసీబీ సహాయంతో పునాదులను తొలగించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ మాట్లాడుతూ అనధికార నిర్మాణాలను ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అన్ని అనుమతులు పొందిన తర్వాతనే ఎటువంటి నిర్మాణాలనైన చేపట్టాలని సూచించారు.

అలరించిన గాత్రకచేరీ



గాత్రకచేరీ నిర్వహిస్తున్న దేవీ సుజాత

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నిర్వహించిన టి.దేవీ సుజాత గాత్రకచేరీ ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై హెచ్.రామ్‌చరణ్, మృదంగంపై పి.సురేష్‌కుమార్, అనంతరం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన డాక్టర్ మావుడూరి సత్యన్నారాయణ శర్మ వయోలిన్ కచేరీ అలరించింది. మృదంగంపై సూర్యప్రసాదరావు, ఘటంపై బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మలు సహకారమందించారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మి పర్యవేక్షించారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

నెల్లిమర్ల: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని జెడ్పీ సీఈవో బీవీ.సత్యనారాయణ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జెడ్పీ సీఈవో బుధవారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావటంతో పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో రామకృష్ణంరాజుకు సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో పి.సుదర్శనం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభరీతి బోధనతో సత్ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ కళాశాల అధ్యాపకులు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ రీతిలో బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయని డైట్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. మండలంలోని ముళ్లపేట ఎంపీపీఎస్‌ను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాన్ని తెలుసుకుని ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఒత్తిడి లేని బోధన అందిస్తే మంచి విద్యార్థులుగా మారుతారన్నారు. ఆట, పాటలతో కూడిన విద్య ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపక బృంద ప్రతినిధులు రంజిత, సూర్యకళ, సౌమ్య, ఇందిర, మురళి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

డీజే... గుండె గుభేల్...!

- గుండెలదిరేలా... కర్ణభేరి పగిలేలా
- శ్రుతిమించుతున్న డీజే శబ్దాలతో ప్రజల బెంబేలు



డీజే వాహనం

విజయనగరం: వినాయక చవితి అంటే ఊరూరా.. వీధి వీధినా సందడి వాతావరణం నెలకొంటుంది. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. చిన్నారులు మొదలు పెద్దల వరకు అంతా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకుంటున్నారు. ఇందులో భాగంగానే మండపాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొందరు చూపే అత్యుత్సాహం ఇతరులకు కొంతమేర ఇబ్బందికరంగా పరిణమిస్తుంటాయి. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు. ఆ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. మితిమీరిన శబ్ద కాలుష్యం ప్రస్తుతం ఫ్యాషన్ అవుతోంది. రాజకీయ నాయకులకు స్వాగతం పలకాలన్నా.. పెళ్లి ఊరేగింపు జరపాలన్నా.. డీజే తప్పనిసరి అయింది. ఇక వినాయక చవితి విగ్రహాల నిమజ్జనం జరిగే సమయంలో వీటికి ప్రాధాన్యం ఎక్కువ. అధిక ధ్వనితో వృద్ధులు, చిన్నారులు భయకంపితులవున్నారు. పక్కపక్కనే ఉన్న వారికి మాట వినపడని పరిస్థితి. భారీ శబ్దాల కారణంగా చెవిలోని కర్ణభేరి ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. తద్వారా భవిష్యత్తులో వినికిడి శక్తి కోల్పోతారు.

అమలు కాని నిబంధనలు

రాత్రి పది గంటల నుంచి తెల్లారి ఆరు గంటల వరకు భారీ శబ్దాలతో ఊరేగింపులు పూర్తిగా నిషేధం. శబ్ద కాలుష్యంపై రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని 2015లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినా ఎక్కడా అమలు కావటం లేదు.

వీనుల విందుగా ఉంటేనే మేలు

మండపాల వద్ద భక్తి గేయాలంటే అందరికీ ఇష్టమే. పరిమిత శబ్దంతో ఉంటే అది మనసును రంజింపజేస్తుంది. శ్రుతి మించితే అనర్థాలకు దారి తీస్తుంది. ఇటీవల డీజేల వినియోగం ఎక్కువవుతోంది. ప్రధానంగా నిమజ్జనోత్సవం రోజును వీటి హడావుడి అధికంగా ఉంటుంది. వీటి నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి. వేడుకకు కనీసం 24 గంటల ముందు స్థానిక ఎస్ఐకి సమాచారం అందించాలి. మీసేవా, ఈ సేవా కేంద్రాల్లో రుసుము చెల్లించాలి.

ఈ ప్రాంతాల్లో కుదరదు

60 డెసిబుల్స్ వరకు కర్ణభేరి తట్టుకోగలుగుతుంది. 85 డెసిబుల్స్ దాటితే ప్రమాదకరంగా మారుతుంది. పగటి వేళల్లో నివాస ప్రాంతాల్లో 55, వాణిజ్య ప్రాంతాల్లో 65 డెసిబుల్స్ వరకే పోలీసులు అనుమతిస్తున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 వరకు డీజేలు, లౌడ్ స్పీకర్లు వినియోగించొద్దని సూచిస్తున్నారు. ఆసుపత్రులు, విద్యాలయాలు, శిక్షణ కేంద్రాలు, న్యాయస్థానాలు, ప్రార్థనా మందిరాలున్న ప్రాంతాల్లో డీజేల వినియోగానికి అనుమతి లేదు. ఈ విషయమై మన్యూరు సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. డీజేల వినియోగంలో పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాధితులు పెరుగుతున్నారు

చెవి సమస్యతో వచ్చే వారి సంఖ్య రోజూ పెరుగుతోంది. ఉత్సవాలు, ఊరేగింపుల సమయాల్లో బాధితుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. చెవికి విశ్రాంతి లేకుండా చేయడం వల్ల సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు.మానవ శరీరంలో అత్యంత సున్నితమైన అవయువాల్లో చెవి ఒకటి. యువత దీని ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపడం ఆందోళన కలిగించే విషయం.

– నాగమనోహర్, ఈఎన్‌టీ వైద్యులు

సాంకేతిక సవాల్‌కు విద్యార్థులు సిద్ధం కావాలి

- సీతం కళాశాలలో ఏఐపై వర్క్‌షాప్‌లో ఓపెన్ టెక్స్ సంస్థ ప్రతినిధి చైతన్య

విజయనగరం అర్బన్: అత్యాధునిక సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా ప్రతిభను సాధించుకునే సవాల్‌ను విద్యార్థి దశ నుంచే ఎదుర్కోనాలని బెంగళూరుకి చెందిన ఓపెన్ టెక్స్ సంస్థ సీనియర్ క్వాలిటీ అష్యూరెన్స్ ఇంజినీర్ వీఎస్ చైతన్య అన్నారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై హౌ టు బి ఏఐ రెడీ' అనే అంశంపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్, భవిష్యత్ సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఇప్పుడే ఎలా సిద్ధపడాలో విశదీకరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఏఐ రంగంలో నైపుణ్యాలు సంపాదించడం ద్వారా విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో పోటీ పడగలరని అన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జిల్లా పరిషత్ చైర్మన్‌మజ్జి శ్రీనివాసరావును కలిసిజన నాగార్జున యాదవ్

విజయనగరం: విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును పార్టీ రాష్ట్ర వాలంటీర్స్ విభాగం అధ్యక్షుడు యనమల నాగార్జున యాదవ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కలయిలో ఇరువురు నాయకులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వాలంటీర్స్ విభాగ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేసి పార్టీ సంస్థాగత నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నాగార్జున యాదవ్ కోరారు. సమావేశంలో వాలంటీర్స్ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ భాస్కర్ రెడ్డి, విశాఖపట్నం జిల్లా వాలంటీర్స్ విభాగ అధ్యక్షలు ప్రేమ్ కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

విజయనగరం: నగరంలోని 33, 48, 49 సచివాలయాలను విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 33 నంబరు సచివాలయానికి చేరుకున్న ఆయన పన్ను పరిధిలోకి రాని ఆస్తి వివరాలు నమోదు, అదనపు నిర్మాణాలపై పన్ను విధింపు వంటి ప్రక్రియలు ఏ విధంగా చేపడుతున్నారన్న విషయాలను గమనించారు. రెవెన్యూ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పన్ను విధింపు ప్రక్రియలు ఏ విధంగా చేపడుతున్నారన్న విషయాలపై ఆరా తీశారు. అలాగే 48, 49 సచివాలయాల పరిధిలో దీర్ఘకాలంగా నీటి చార్జీ బకాయిలు ఉన్న కుళాయి కనెక్షన్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సకాలంలో విధులకు హాజరవుతూ మెరుగైన పౌర సేవలు అందించాలన్నారు. ప్రజా ఫిర్యాదులు తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. నీటి చార్జీల వసూళ్లను మెరుగుపరచాలని చెప్పారు. దీర్ఘకాల బకాయిలను ఉపేక్షించవద్దని సూచించారు.

పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

విజయనగరం క్రైమ్ : నగరంలోని వైఎస్సార్ నగర్‌లో పేకాట ఆడుతూ ఎనిమిది మంది పట్టుబడినట్టు టు టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. 100 ద్వారా అందిన సమాచారం మేరకు దాడులు చేపట్టగా ఎనిమిది మంది యువకులు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరి నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.17,595 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఎరువులు అందించేదెప్పుడు..!



సమావేశంలో ఎరువుల కొరతపై వివరణ ఇస్తున్న ఏవో

- వాడీవేడిగా మండల సమావేశం

జియ్యమ్మవలస రూరల్: సకాలంలో ఎరువులు అందక రైతులు పడుతున్న అవస్థలపై సభ్యులు వ్యవసాయ అధికారిని నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మండల సమావేశం బుధవారం జరిగింది. ప్రస్తుతం రైతులకు ఎరువుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఎరువులు అందక రైతులంతా ఇబ్బందుల పాలవుతున్నారని ఎంపీపీ ధ్వజమెత్తారు. రైతులకు ఎరువులు ఇవ్వలేనప్పుడు అన్నదాత సుఖీభవ పథకం ఇస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. కాంప్లెక్స్ ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని శిఖబడి సర్పంచ్ రమేష్ నాయుడు ఆరోపించారు. వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ గోశాలలు పశువుల కోసం మంజూరు చేశారా.. వాహనాలు నిలుపుకొనేందుకు మంజూరు చేశారా..? అని ఏపీవోను ప్రశ్నించారు. సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్ల పనితీరు బాగోలేదని వారు గ్రామాల్లోని రైతులతో ఎలాంటి సత్సంబంధాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చినమేరంగిలోని కేజీబీవీలో తాగునీటి సమస్య ఉందని, అక్కడి సిబ్బంది పనితీరు బాగోలేదని చర్యలు తీసుకోవాలని సభ్యులు ఎంఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో ధర్మారావు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సర్పంచ్‌లు సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భోగాపురం: యువత, విద్యార్థులు కొకైన్, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ హెచ్‌సీ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బసవపాలెం అవంతి పాలిటెక్నికల్ కళాశాలలోని విద్యార్థులకు బుధవారం జిల్లా ఈగల్ బృందం సభ్యులు మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు మరియు ఈగల్ టోల్‌ఫ్రీ నంబరు 1972పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు భవిష్యత్‌కు అనర్థదాయకమన్నారు. ప్రాథమిక స్థాయిలో మాదక ద్రవ్యాలు వినియోగించే అలవాటు ఉంటే డీ–అడిక్షన్ సెంటర్స్‌లో అందించే చికిత్స ద్వారా స్వస్థత పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

నెల్లిమర్ల: శతశాతం అక్షరాస్యతతో అభివృద్ధి సాధ్యమవుతుందని డైట్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు అన్నారు. స్థానిక వేణుగోపాలపురం డైట్‌లో ఉల్లాస్ అక్షర ఆంధ్రా కార్యక్రమం వారోత్సవాల్లో భాగంగా ఛాత్రోపాధ్యాయులకు అందరికీ విద్య శతశాతం అక్షరాస్యత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ వి.చిన్నంనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, సిబ్బంది ఎం.రమేష్, కమల కుమారి, సూరిబాబు, శ్రీనివాసరావు, అప్పారావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ముంజూరు' కవితా సంకలనం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ బుధవారం ముంజూరు పుస్తకావిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా సాహితీ స్రవంతి అధ్యక్షుడు చీకటి దివాకర్ వ్యవహరించారు. డాక్టర్ ఎం.రమాగీతాదేవి, బాల సుధాకర్ మౌళిలు పుస్తక సమీక్ష చేశారు. సమాజంలో ఉన్న అనేక అంశాల మీద స్పందించి సాహిత్యం, సామాజిక చైతన్యం, సంఘ శ్రేయస్సును కోరుతూ చేస్తున్న కవిత్వమే చిరకాలం నిలుస్తుందన్నారు. సాహితీవేత్తలు మానాపురం రాజా చంద్రశేఖర్, ఎస్.కె.బాబు, పాయల మురళీకృష్ణ, కోఆర్డినేటర్ రూపవాణి, డాక్టర్ బి.సుభ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ

నెల్లిమర్ల: మండలంలోని తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు సర్‌ప్లస్ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన 55 మంది రైతులకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు సర్‌ప్లస్ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బొబ్బిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీలాగాంధీ మాట్లాడుతూ బాధిత రైతులు భూములకు సంబంధించిన పత్రాలను సకాలంలో కోర్టుకు అందజేయాలని సూచించారు. అప్పుడు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, డీటీ ఉమ పాల్గొన్నారు.

రోటరీ నవతరోత్సవ్ ప్రారంభం



రోటరీ నవతరోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు, క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో నవతరోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ కమిటీ డైరెక్టర్ రోహిత్ సంజయ్ మాట్లాడుతూ యువతలో సేవా భావాన్ని కలిగించేందుకు, క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఏటా సెప్టెంబర్ నెలలో రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో నవతరోత్సవాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చైర్మన్ గ్రంధి కృష్ణతేజ మాట్లాడుతూ నవతరోత్సవాలలో భాగంగా నెల రోజుల పాటు సంగీతం, సాహిత్యం, క్రీడా రంగాలకు సంబంధించి 15 కార్యక్రమాలలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవతరోత్సవాల పోటీలకు విద్యార్థులు, విద్యా సంస్థల నుంచి చక్కని స్పందన లభిస్తోందన్నారు. ఉత్సవాల మొదటి రోజు నిర్వహించిన డ్యాన్స్ పోటల్లో 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరికి ఉత్సవాల ముగింపు రోజున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయ్‌కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్‌కుమార్, చైర్మన్ చెన్నా ప్రదీప్, ప్రతినిధులు ఆర్.శంకర్‌రెడ్డి, పి.జయకృష్ణ, కాపుగంటి శ్రీనివాస్, ప్రకాష్, టి.ఎల్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాదం మిల్క్ తయారీ కేంద్రాల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బాదం మిల్క్ కేంద్రాలపై విజయగనరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు బుధవారం చేపట్టారు. గుడ్స్ షెడ్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న బాదం మిల్క్ కేంద్రాన్ని తనిఖీ చేసి అపరాధ రుసుము విధించారు. నగరంలో ఇంకా ఇటువంటి అనధికార కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? వాటి పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి బృందం ఈ మేరకు దాడులకు ఉపక్రమించింది. బాదం మిల్క్ తయారీ కేంద్రంలో ఎటువంటి పరిశుభ్రత పాటించకుండా, కాలం మీరిన పాలతో బాదం మిల్క్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. కాలం మీరిన పాలను బయట పారబోశారు. తాజా పదార్థాలతోనే పానీయాలు తయారు చేసుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించకుండా బాదం మిల్క్,ఐస్ క్రీమ్‌లను పెద్ద ఎత్తున తయారు చేస్తున్న కేంద్రాలు సుమారు 50 వరకు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే ట్రేడ్ లైసెన్సులు కూడా పొందలేదని గమనించారు. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలిగించే బాదం మిల్క్ కేంద్రాల యజమానులు ఇక నుంచి ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాల్సిందేనని ప్రజారోగ్యాధికారి డాక్టర్ సాంబమూర్తి స్పష్టం చేశారు. లేకుంటే ఆయా కేంద్రాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఆరుద్ర శత జయంతి



ఆరుద్ర చిత్రపటం వద్ద నివాళులు

విజయనగరం: కవి, కథకుడు, డిటెక్టివ్ నవలా రచయిత , గేయకర్త, వ్యాసకర్త, గడీనుడీకారుడు, మెజీషియన్, విమర్శకుడు, పరిశోధకుడు, అనువాదకుడు బహుముఖ ప్రజ్ఞాశాలి ఆరుద్ర శత జయంతిని గురజాడ స్వగృహంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఆరుద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల గురు ప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ మాట్లాడుతూ వైవిధ్యాలు, ప్రాకృతిక సౌందర్యాలు, ఉద్యమ వైతాళిక ప్రబోధాలు, సమసమాజ స్వాప్నిక సృజనలు, జనోపయోగ రచనా ప్రయోగాల సమాహారం ఆరుద్ర కవిత్వమని అన్నారు. గాయాలూ గేయాలు, సాహిత్యోపనిషత్, కూనలమ్మ పదాలు, సినీ వాలి, పైలా పచ్చీసు, తదితర రచనలు చేశారని, ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు ఆయన మరణానంతరం వెలువడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సలహాదారు ముళ్ళపూడి సుభద్ర దేవి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జీవీ శ్రీనివాస్, కోశాధికారి సూర్యలక్ష్మి, దాసరి పద్మ, మహాకవి గురజాడ కుటుంబీకులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మహాకవి గురజాడ ఇంటిని, సాహిత్యాన్ని ప్రభుత్వం కాపాడాలి

- గురజాడ గృహంలో శాంతి దీక్ష చేపట్టిన సాహితీవేత్తలు



గురజాడ ఇంట్లో శాంతి దీక్ష చేస్తున్న భీశెట్టి బాబ్జీ తదితరులు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ ఇంటిని, సాహిత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని, అందుకు తగిన ఏర్పాట్లు తక్షణమే చేపట్టాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు సాహితీవేత్తలు, అభిమానులతో మహాకవి ఇంటి ఆవరణలో బుధవారం శాంతి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రచనల ద్వారా సామాజిక చైతన్యం కలిగించి వ్యవహారిక భాషోద్యమకారునిగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మహోన్నత వ్యక్తి నడయాడిన గృహాన్ని ఆధునీకరించాలని కోరారు. వారి సాహిత్యాన్ని ముందు తరానికి అందించేందుకు డిజిటలైజ్ చేయాలని, సెప్టెంబరు 21న నిర్వహించనున్న గురజాడ 163వ జయంతిని రాష్ట్ర పండగగా ప్రభుత్వం నిర్వహించాలని, సెప్టెంబరు 4న ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ శాంతి దీక్ష నిర్వహించామన్నారు. 150 ఏళ్లకి పైగా చరిత్ర కలిగిన గురజాడ అప్పారావు గృహాన్ని కాపాడటంలో సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖలు పూర్తి స్థాయిలో విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. శాంతిదీక్షకి నగరంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రతినిధులు ప్రభాకరరావు, రామ్మోహనరావు, గోపి, దవడ కొండబాబు, మీనా, ధవళ సర్వేశ్వరరావు, నాలుగెస్సుల రాజు, కాపుగంటి ప్రకాష్, జక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంతో ఖర్చు ఆదా..



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగభూషణం

డెంకాడ: వ్యవసాయ సాగులో డ్రోన్‌ల వినియోగం వలన ఖర్చు తగ్గుతుందని విజయనగరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణం అన్నారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) ద్వారా వరి పంటకు నానో యూరియాను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడంపై ప్రయోగాత్మకంగా చేసి చూపించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగభూషణం మాట్లాడుతూ డ్రోన్ ద్వారా ఎకరాకు నానో యూరియాను 3 నుంచి 5 నిమషాల్లో పిచికారీ చేయవచ్చన్నారు. మొక్కకు పోషకాలు బాగా వేగంగా అందుతాయని వివరించారు. పంటల సాగులో కాలంతో పాటు అనేక రకాలైన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, ఏవో టి.సంగీత, వ్యవసాయ సహాయకులు రాంబాబు, రైతులు పాల్గొన్నారు.